సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 16 । ఆగస్టు । 2024


దల్లాపల్లి కొండపై జెండా పండగ నిర్వహిస్తున్న ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధులు, చిన్నారులు

న్యూస్‌రీల్

రేంజ్ కార్యాలయంలో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు


జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

సాక్షి, విశాఖపట్నం: స్వాతంత్య్రం కోసం ప్రాణ త్యాగం చేసిన సమరయోధులను గుర్తు చేసుకుని, వారి ఆశయాలకు అనుగుణంగా భావితరాలు పనిచేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ అన్నారు. విశాఖ జిల్లా పెదవాల్తేరులోని డీఐజీ కార్యాలయంలో 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం వేడుకలు ఘనంగా జరిగాయి. డీఐజీ గోపీనాథ్ జెట్టీ జాతీయ పతాకావిష్కరణ చేసి, గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా రేంజ్ పరిధిలోని పోలీస్ అధికారులకు, సిబ్బందికి స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రేంజ్ కార్యాలయ మేనేజర్ సూర్యారావు, శ్రీకాంత్, సీసీ గణేష్, ఇన్‌స్పెక్టర్‌లు రమణయ్య, ప్రేమ్‌కుమార్, మల్లికార్జునరావు, సతీష్, ఎస్‌ఐ రమేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు సత్కారం


సొమన్న, కిలో లైకాన్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: స్వాతంత్య్ర సమరయోధులు బాడంగి భీమన్న(హుకుంపేట),కిలో గురు (పాడేరు)కుమారులు సోమన్న, లైకోన్‌లను కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ సత్కరించారు. స్వాతంత్య్ర దిన వేడుకల్లో భాగంగా తలారిసింగి వేదికపై జరిగింది.

ఘాట్ రోడ్లో కారు బోల్తా


ఘాట్‌రోడ్డు లోయలో పడిన కారు

గూడెంకొత్తవీధి: మండలంలోని రంపుల ఘాట్ రోడ్లో గురువారం ఉదయం కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఇద్దరిలో ఒకరు గాయపడ్డారు. కారులోని వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

నవజాత శిశువు మృతిపై విచారణ


వైద్యశిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

గూడెంకొత్తవీధి: పనసపల్లిలో నవజాత శిశువు మృతిపై వైద్యారోగ్యశాఖ అధికారులు విచారణకు ఆదేశించారు. దీంతో గురువారం ఆర్వీనగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది పనసపల్లి గ్రామానికి చేరుకుని ప్రాథమిక విచారణ చేశారు. అనంతరం ఆగ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. రోగులను పరీక్షించి వారి నుంచి రక్త పూతలను సేకరించారు.

వరదల్లో ఉత్తమ సేవలకు పురస్కారాలు

చింతూరు: చింతూరు డివిజన్లో ఈ ఏడాది సంభవించిన వరదల్లో ఉత్తమ సేవలందించిన పలువురు ఉద్యోగులకు కలెక్టర్ దినేష్‌కుమార్ చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. పోలవరం స్పెషల్ కలెక్టర్ సరళ వందనం, సివిల్ సప్లై డీఎం గణేష్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ మురళి, పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, చింతూరు తహసీల్దార్ నజీముల్లాషా, వీఆర్‌పురం తహసీల్దార్ మౌలానా ఫాజిల్, చింతూరు ఎంపీడీవో రవిబాబు, వీఆర్‌పురం ఎంపీడీవో ఫణీంద్ర, చింతూరు ఎంపీఏ రాజేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బుచ్చిబాబు, ఐటీడీఏ పీవో సీసీ పవన్ వర్మ, చింతూరు వీఆర్‌వో రామచంద్రం ప్రశంసా పత్రాలు అందుకున్నారు.


ద్వితీయస్థానం సాధించిన కేజీబీవీ పాఠశాల బాలికల ప్రదర్శన


స్వాతంత్య్ర వేడుకల్లో వైద్య సిబ్బంది శకటం


ఆకట్టుకున్న పోలీసుల ఆయుధ ప్రదర్శన


తృతీయ స్థానం పొందిన దిగుమోదాపుట్టు బాలల విన్యాసం

మహనీయుల స్ఫూర్తి.. తరగని కీర్తి

- వీరుల త్యాగాలు చిరస్మరణీయం
- వారి ఆశయసాధనే లక్ష్యంగా సమగ్రాభివృద్ధికి కృషి
- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్
- వాడవాడలా ఘనంగా స్వాతంత్య్ర దిన వేడుకలు


జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగరవేస్తున్న ఎస్పీ అమిత్‌బర్ధర్

సాక్షి,పాడేరు: ఆంగ్లేయుల పాలన నుంచి భారతావని విముక్తికోసం వేలాది మంది వీరులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. 78వ స్వాతంత్య్ర దిన వేడుకలను గురువారం జిల్లా కేంద్రం పాడేరులో ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టరేట్‌లో జాతీయ జెండాను కలెక్టర్ ఆవిష్కరించారు. జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్, ఇతర అధికారులంతా జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం తలారిసింగి ఆశ్రమ పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి స్వాతంత్య్ర దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెరేడ్‌కు చేరుకున్న కలెక్టర్‌తో పాటు అధికారులందరికీ పోలీసు కవాతు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ దినేష్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కలెక్టర్‌తో పాటు జేసీ అభిషేక్‌గౌడ్, ఎస్పీ అమిత్‌బర్ధర్, ఐటీడీఏ పీవో అభిషేక్ జాతీయ జెండాకు సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో నేను సైతం అంటూ ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి అనేక మంది దేశభక్తులు పాల్గొన్నారన్నారు. అల్లూరి సీతారామరాజు, కందాళ సుబ్రహ్మణ్యంతిలక్, తెన్నేటి విశ్వనాథం, దిగమర్తి రామస్వామి, కేఎస్ గుప్తా, ఆదివాసీ సమరయోధులు గాం గంటందొర, గాంమల్లుదొర, మర్రి కామయ్య, బోనంగి పండవ డాల్, తగ్గి వీరయ్యదొరల త్యాగాలు మరువలేనివన్నారు. వారు సాధించిన స్వాతంత్య్రం వల్లే ఈ రోజు స్వేచ్ఛగా జీవించగలుగుతున్నామన్నారు. వారి త్యాగాలు వృధా కానివ్వకుండా జిల్లా అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న అన్నిశాఖల అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు.

అబ్బురపరిచిన నృత్యాలు

పాడేరు ప్రాంతంలోని 22 విద్యాలయాలకు చెందిన వివిద్యార్థుల నృత్య రూపకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రథమ,పాడేరు కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు ద్వితీయ, దిగుమోదాపుట్టు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. వీరిని కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్ధర్, జేసీ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పివో అభిషేక్ అభినందించి బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. పోలీసు బలగాలు తుపాకుల ప్రదర్శన, జాగిలం విన్యాసాలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలు ప్రభుత్వ పథకాలపై శకటాలు, స్టాళ్లను ప్రదర్శించారు.

మహనీయుల త్యాగఫలం మరువలేనిది: అరకు ఎంపీ తనూజరాణి

పాడేరు : దేశానికి స్వాతంత్య్ర సాధనలో అనాటి మహనీయుల త్యాగఫలం ఎప్పటికి మరువలేనిదని అరకు ఎంపీ గుమ్మా తనూజరాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆమె జాతీయ జెండాను ఎగరవేసి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన ప్రతి ఒక్కరిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం అరకు ఎంపీతోపాటు ఆమె భర్త వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ దంపతులను సిబ్బంది సత్కరించారు.

పాడేరు ఐటీడీఏలో..

స్థానిక ఐటీడీఏలో పీవో వి.అభిషేక్ జాతీయ జెండాను ఎగురవేసి సెల్యూట్ చేశారు. విద్యార్థులకు స్వీట్లు, మిఠాయిలు పంచి పెట్టారు. ఐటీడీఏ ఆవరణలో ఉన్న స్వాతంత్య్ర సమరయోధులు అల్లూరి సీతారామరాజు, గాం మల్లుదొర, భగవన్ బిర్సా ముండా విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఏపీవో ప్రభాకర్, టీడబ్ల్యూ ఈఈ డీవీఆర్ఎం రాజు, డీఆర్‌డీఏ పీడీ మురళి, ఐటీడీఏ ఏవో హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవో కావూరి చైతన్య జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. ఏఎస్పీ రాహుల్‌మీనా, డీఎఫ్‌వో బబితతో పాటు ఉద్యోగులు, విద్యార్థులతో కలసి గురుకుల పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సెల్ఫీతో కూడిన సంతకాల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయంలో చింతూరు డివిజన్లో ఉత్తమ సేవలందించిన 150 ఉద్యోగులకు ప్రసంశా పత్రాలను వారు అందజేశారు. మండల పరిషత్ వద్ద ఎంపీపీ సవలం అమల, గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కారం కన్నారావు, అల్లిగూడెంలో సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్లు లలిత్, చేతన్ జెండాలు ఎగురవేశారు.

త్యాగమూర్తులను గుర్తుంచుకోవాలి

రంపచోడవరం : దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన త్యాగమూర్తులను ఎప్పటికప్పుడు గుర్తుంచుకునే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, స్థానిక ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏ ప్రాంగణంలో జరిగిన స్వాతంత్య్ర దిన వేడుకల్లో పీవో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, రంపచోడవరం అడిషనల్ ఎస్పీ జగదీష్ అడహళ్లి పాల్గొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు అభివృద్ధి పథకాలను, ఏజెన్సీలో అభివృద్ధిని పీవో వివరించారు. మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగ బొజ్జియ్య, వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, ఉలవల లక్ష్మి సాయి, ఏపీవో జనరల్ సీహెచ్ శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

శకటాల ప్రదర్శనపై విమర్శలు

సాక్షి, పాడేరు: ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ అభివృద్ధి పథకాలకు సంబంధించి శకటాలను అధికారులు ప్రదర్శించడం విమర్శలకు తావిచ్చింది. వ్యవసాయ, ఉద్యానవన, ఐటీడీఏ కాఫీ విభాగం, వైద్య ఆరోగ్యశాఖ తదితర శకటాలను పెరేడ్ మైదానంలో ప్రదర్శించడంతో పాటు పాడేరు పురవీధుల్లో తిప్పారు. ఈ విషయమై కలెక్టర్ దినేష్‌కుమార్‌ను సాక్షి వివరణ కోరగా ఈ శకటాలలో ప్రజాప్రతినిధుల ఫొటోలను ముద్రించలేదన్నారు. ఎన్నికల నిబంధనలకు లోబడి కొన్ని శకటాలను ఆయా శాఖల అధికారులు రూపొందించారని ఆయన తెలిపారు.


జాతీయ జెండాను ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్‌గౌడ్, ఎస్పీ అమిత్‌బర్ధర్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్


పాడేరు ఐటీడీఏలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న పీవో అభిషేక్


రంపచోడవరం ఐటీడీఏ వద్ద వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ అనంత బాబు, ఐటీడీఏ పీవో సింహాచలం, సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్


పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న అరకు ఎంపీ తనుజారాణి


పాడేరు తలారిసింగి మైదానంలో నిర్వహించిన వేడుకల్లో ప్రదర్శించిన ప్రభుత్వ శాఖ శకటం


భారత దేశ చిత్ర పటానికి సెల్యూట్ చేస్తున్న జాగిలం


ఐసీడీఎస్ స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్, జేసీ అభిషేక్ గౌడ్,ఐటీడీఏ పీవో అభిషేక్


పాడేరు తలారిసింగి మైదానంలో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్


రంపచోడవరంలో ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష దేవి


చింతూరు ఐటీడీఏ వద్ద వేడుకల్లో పీవో కావూరి చైతన్య, ఏఎస్పీ రాహుల్‌మీనా


కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్‌గౌడ్, ఎస్పీ అమిత్‌బర్ధర్, పీవో అభిషేక్ నుంచి పురస్కారం అందుకుంటున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

ఉత్తమ సేవలకు పురస్కారాలు

సాక్షి,పాడేరు: జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన 380మంది అధికారులు,ఉద్యోగులకు కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఉత్తమ పురస్కారాలు అందజేశారు.


ఉత్తమ పురస్కారాలు అందుకుంటున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, రంపచోడవరం టీడబ్ల్యూ ఈఈ మురళి, పాడేరు ఆర్టీసీ డీఎం శ్రీనివాస్, డీపీవో కొండలరావు, ఎస్‌డీసీ శర్మ, జిల్లా వ్యవసాయాధికారి నందు, డీఎల్పీవో పీఎస్‌కుమార్, పోలవరం ఎస్‌డీసీ అంబేద్కర్, ఎంపీడీవో సాయినవీన్, సమాచారశాఖ డీపీఆర్వో గోవిందరావు, డివిజనల్ పీఆర్వో పి.రాములు, విద్యుత్ పంపిణీ సంస్థ పాడేరు ఈఈ అప్పారావు, పాడేరు డీఈఈ మల్లేశ్వరరావు, కలెక్టర్ సీసీలు శేఖర్, శ్రీధర్, గురుకులం సెల్ ఇన్‌చార్జి పీఎస్ఎన్ మూర్తి,వీఆర్వో సంధ్య, పీఎంఆర్‌సీ కేర్‌టేకర్ సుబ్రహ్మణ్యం, ట్రైకార్ సీనియర్ అసిస్టెంట్ సీతారామయ్య,వీఆర్‌పురం తహసీల్దార్ మౌలానా ఫాజిల్.

పెదబయలు ఆశ్రమ విద్యార్థుల ప్రతిభ

- వక్తృత్వం, లఘుచిత్ర ప్రదర్శనలో బహుమతులు

పెదబయలు: ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కార్ప్స్ బయోడైవర్సిటీ జిల్లా స్థాయి వక్తృత్వం, మరవి లఘు చిత్ర ప్రదర్శనలో భాగంగా స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-1 విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరు ప్రథమ స్థానంలో నిలిచారని ప్రధానోపాధ్యాయులు టి.నాగేశ్వరరావు తెలిపారు. గురువారం పాడేరులో జరిగిన స్వాతంత్య్ర దిన వేడుకల్లో కలెక్టర్ దినేష్‌కుమార్, పాడేరు ఐటీడేఈ పీవో చేతుల మీదుగా విద్యార్థులు గుంట తరుణ్, గొండెలి చిట్టినాయుడు, కొర్ర జానిబాబు బహుమతి అందుకున్నారన్నారు. జీవ వైవిధ్యంపై అవగాహన కల్పిస్తున్న పాఠశాల జీవ శాస్త్రం ఉపాధ్యాయులు చెండా బాలకృష్ణను కలెక్టర్ అభినందించారు.


పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న ఆశ్రమ విద్యార్థులు


కలెక్టర్ దినేష్‌కుమార్ చేతులు మీదుగా బహుమతి అందుకుంటున్న విద్యార్థి తరుణ్

విశాఖ ఉక్కుకు పెరిగిన డిమాండ్

ఉక్కునగరం (విశాఖ): దేశ వ్యాప్తంగా ఉక్కుకు గణనీయంగా డిమాండ్ పెరిగిందని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్ అన్నారు. ఉక్కు త్రిష్టా మైదానంలో జరిగిన స్వాతంత్య్ర దిన వేడుకల్లో పాల్గొని జెండాను ఆవిష్కరించారు. సీఐఎస్ఎస్ సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించి మాట్లాడారు. ఈ ఏడాది మేలో స్టీల్‌ప్లాంట్ పరిస్థితిని ఉక్కు మంత్రిత్వశాఖ సమీక్షించిందన్నారు. ఉత్పత్తి పెరుగుదల, ఖర్చులను తగ్గించడం, ఆర్థిక రాబడిలో మెరుగుదల విధానాలను అవలంబించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్‌కు చెందిన ఫైర్ ఫైటింగ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, రైఫిల్ రిఫ్లెక్స్ షూటింగ్ టీమ్‌ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయాలైన యువకుడికి 108 సిబ్బంది సపర్యలు


108లో ఎక్కిస్తున్న స్థానిక యువత

డుంబ్రిగుడ: మండలంలోని ఎన్‌హెచ్ 516 చాపరాయి – అంత్రిగుడ నూతన వంతెన వద్ద గురువారం సాయంత్రం ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో పాడేరు నుంచి అరకులోయ వైపు వెళ్తున్న కొర్రా పంచాయతీ బొర్రాపాలెనికి చెందిన ఇద్దరు యవకులకు తీవ్ర గాయాలయ్యాయి. కిల్లో వోనది అనే యువకుడికి ఎడమ కాలు మడం వద్ద విరిగిపోగ ముఖం, తలపై తీవ్ర గాయాలయ్యాయి. అలాగే మరో యువకుడు కొర్రా ధర్మరావుకు ఎడమ కాలు తోడ భాగం దెబ్బతింది. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి సపర్యాలు చేసి అరకులోయ సీహెచ్‌సీకి తరలించారు. కాగా ఇద్దరు యువకులు ఒకే ద్విచక్రవాహనంపై ఉన్నారు. ఈ సంఘటనలో ఎదురుగా వస్తూ అరకులోయ నుంచి పాడేరు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనచోదకులు సంఘటన స్థలం నుంచి పరారయ్యారు. అతివేగంతో వాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ సంఘటనపై పోలీసులకు సమాచారం తెలియాల్సి ఉంది.

నేటి నుంచి జూడాల సమ్మె

మహారాణిపేట (విశాఖ): కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై లైంగిక దాడి, హత్య నేపథ్యంలో నిరసనగా జూనియర్ వైద్యులు, విద్యార్థులు ఆందోళన ఉధృతం చేయాలని నిర్ణయించారు. శుక్రవారం నుంచి కేజీహెచ్‌లో సమ్మె చేస్తున్నట్టు ఆంధ్రా మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.పృథ్వీరాజ్ ప్రకటించారు. అత్యవసర సేవలకు కూగా దూరంగా ఉంటామని స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు ఆర్‌కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. తమ ఆందోళనకు అన్ని సంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఇదిలావుండగా గురువారం జూనియర్ వైద్యులు విధులు బహిష్కరించారు. గురువారం ఆస్పత్రిలో, మెడికల్ కాలేజీలో నిరసన ప్రదర్శన చేశారు. జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, సెంట్రల్ హెల్త్ కేర్ ప్రొటెక్షన్ యాక్టును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూనియర్ వైద్యులు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ పృథ్వీరాజ్, ఉపాధ్యక్షుడు ఆర్.ఊహ, కార్యదర్శి వివేక్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం (విశాఖ): కేకే లైన్లో, నౌపడ–గుణుపూర్ లైన్లలో జరుగుతున్న పలు ఆధునికీకరణ పనుల నిమిత్తం పలు రైళ్లు ఆయా తేదీల్లో దంతేవాడ వరకే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ ప్రక తెలిపారు. విశాఖ–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ గురువారం నుంచి 21వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖ (08552) పాసింజర్ స్పెషల్స్ శుక్రవారం నుంచి 22వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి. విశాఖ – కిరండూల్(18514)నైట్ ఎక్స్‌ప్రెస్ గురువారం నుంచి 21వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖ (18513) ఎక్స్‌ప్రెస్ శుక్రవారం నుంచి 22వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి.

ఈ తేదీల మధ్య దంతేవాడ–కిరండూల్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు. ఎన్‌జీ (నౌపడ–గుణుపూర్) లైన్ పరిధిలో ఆగస్టు 17వ తేదీన ట్రాఫిక్ బ్లాక్స్ తీసుకుంటున్నందున విశాఖ–గుణుపూర్ రైళ్లు గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. 17న విశాఖ–గుణుపూర్–విశాఖ (08522/08521) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లు శ్రీకాకుళం రోడ్ వరకే నడుస్తాయి. ఆరోజు శ్రీకాకుళం రోడ్–గుణుపూర్ మధ్య ఈ రైళ్లు నడవవు.

ఉత్తమ సేవలకు అవార్డులు



కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్, ఐటీడీఏ పీవో అభిషేక్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న రాజవొమ్మంగి స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు, అడ్డతీగల 108 సిబ్బంది



రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి, ఐటీడీఏ పీవో సింహాచలం చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంటున్న రాజవొమ్మంగి ఏపీవో సురేష్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ సత్యనారాయణ


చింతపల్లిలో ఉత్తమ ఉద్యోగికి అవార్డు అందజేస్తున్న డీఎఫ్‌వో సూర్యనారాయణ


చింతూరు ఐటీడీఏ పీవో చైతన్య చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఎంపీడీవో లక్ష్మి రెడ్డి


వై.రామవరంలో అవార్డులు అందుకుంటున్న సచివాలయాల సిబ్బంది


డివిజన్ స్థాయి అవార్డు గ్రహీతలు మధుసూదనరాజు, కరుణాధరమ్, మురళి


కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్, ఐటీడీఏ పీవో అభిషేక్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు


ఏఎస్పీ జగదీష్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న జడ్డంగి హెచ్‌సీ సుబ్బారావు


అరకులోయ సీఐ రుద్రశేఖర్, ఎస్ఐ సంతోష్‌ల చేతుల మీదుగా నగదు అవార్డు అందుకుంటున్న కానిస్టేబుల్ రామ్మూర్తి

రాజవొమ్మంగి: రంపచోడవరంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన రాజవొమ్మంగి ఇన్‌చార్జ్ తహసీల్దార్ అల్లు సత్యనారాయణకు ఎమ్మెల్యే శిరీషదేవి, ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకొన్నారు. పాడేరులో జరిగిన కార్యక్రమంలో రాజవొమ్మంగి ఎంపీడీవో ఎల్.యాదగిరీశ్వర్రావు, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ దుర్గారావులు కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దన్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందుకొన్నారు. ప్రశంసపత్రాలు అందుకొన్న వారిలో హెడ్ కానిస్టేబుల్ గోరా సూరిబాబు, ఏపీఓ సురేష్‌కుమార్, 104 అంబులెన్స్ డీఈఓ మాడా శ్రీనివాస్ ఉన్నారు. జడ్డంగి స్టేషన్‌లో హెచ్‌సీగా పనిచేస్తున్న రాచకొండ వెంకట సుబ్బారావుకు ఏఎస్పీ జగదీష్ అడహళి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

అరకులోయ రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రామ్మూర్తి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన సేవలను గుర్తించి సీఐ రుద్రశేఖర్, ఎస్ఐ సంతోష్‌లు నగదు పురస్కారం అందజేశారు.

వై.రామవరం: మండలంలోని పాతకోట సచివాలయం డీజిటల్ అసిస్టెంటు గొర్లె విజై జిల్లాస్థాయి, పంచాయతీ కార్యదర్శులు మురళి, మధుసూదనరాజు, మండలపరిషత్ సీనియర్ అసిస్టెంటు కరుణాధరమ్‌లు ఉత్తమ సేవా అవార్డులను అందుకున్నారు. వీరిని ఎంపీడీవో కె.బాపన్నదొర, ఎంపీపీ కడబాల ఆనందరావు, జడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు వలాల విశ్వమ్మ, ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మీలు అభినందనలు తెలియజేశారు.

గంగవరం: మండల ఇన్‌చార్జి తహసీల్దార్ వీరభద్రరావు, ఎంఆర్ఐ జిలానీ, వీఆర్ఏ భాస్కరరావు, తహసీల్దార్, ఎంఇఓ కార్యాలయ డేటా ఆపరేటర్లు జి. సురేష్, సిహెచ్.సురేష్, పిడతమామిడి గ్రామ సచివాలయ కార్యదర్శి వెంకట సురేష్, గంగవరం సచివాలయ డేటా ఆపరేటర్ శివగణేష్, లక్కొండ పశుసంవర్ధకశాఖ సహాయకురాలు బషీర్‌బీబీ, మండల పరిషత్‌కార్యాలయం ఓఎస్ పి.బాపిరాజులకు జిల్లా అవార్డులకు ఎంపికైయ్యారు. కొమరవరం, పెదగార్లపాడు అంగన్‌వాడీ వర్కర్లు రామాయమ్మ, రాజ్యలక్ష్మి, ఉపాధి హామీ టీఏ మంగాదేవి డివిజన్ స్థాయిలో అవార్డులు అందుకున్నారు. వీరిని ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందించారు.

కూనవరం: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మండలంలో పలువురు ఉత్తమ సేవలు అందించినందుకు గాను గురువారం చింతూరు ఐటీడీఏ పీఓ కావూరి చైతన్య, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. పంచాయతీరాజ్ శాఖ నుంచి ఎంపీడీఓ లక్ష్మి రెడ్డి, ఆఓఆర్‌డీ రామాంజనేయ ప్రసాద్, జగ్గవరం, కూనవరం, కొండ్రాజుపేట, పోచవరం పంచాయతీ కార్యదర్శులు ఎంవీఎస్ఎస్ఎన్ సురేష్, కె.సురేష్, జాహ్నవీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ డి.ప్రశాంత్, డిజిటల్ అసిస్టెంట్ డి.వేణు, వీఆర్‌వో ధర్మరాజు, డిజటల్ అసిస్టెంట్ కె.శ్రీకాంత్, డాక్టర్లు మెహేష్, వివేక్, సునీల్ కుమార్, శ్రీనివాస్, ఆరోగ్యమిత్రా సర్వేశ్వరరావులు చింతూరు ఐటీడీఏ పీఓ కావూరి చైతన్య చేతులమీదుగా చింతూరులో అవార్డు అందుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసరావు, ఇందూ ఎస్ఎన్ సీయూ, జూనియర్ అసిస్టెంట్ పొడియం మేఘన, పోచవరం కార్యదర్శి ఏ ప్రాసాద్‌లు కలెక్టర్ చేతుల మీదుగా ఆవార్డులు అందుకున్నారు.

అడ్డతీగల: మండలం 108 సిబ్బంది పైలెట్ ఎస్‌కె నవాజ్, ఈఎంటీ అశోక్‌కుమార్ కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదగా అవార్డు అందుకున్నారు.

దేవరాపల్లి కానిస్టేబుల్‌కు ప్రెసిడెంట్ మెడల్

దేవరాపల్లి: పంద్రాగస్టు వేడుకల్లో ఏపీ గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ గొర్లె వెంకటరమణకు అరుదైన గౌరవం దక్కింది. దేవరాపల్లికి చెందిన ఆయన్ను ప్రెసిడెంట్ మెడల్ ఫర్ గ్యాలెంట్రీ పతకంతో రాష్ట్ర ప్రభుత్వం సత్కరించింది. గురువారం విజయవాడ పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో సీఎం నారా చంద్రబాబునాయుడు నుంచి పతకాన్ని అందుకున్నాడు. 2012లో ఉద్యోగంలో చేరిన వెంకటరమణ 2021లో ఓ ఘటనలో సమర్థవంతంగా పనిచేసినందుకు ఈ పురస్కారం వరించింది.

గిరిజనుల వినూత్న నిరసన


సమస్య పరిష్కారానికి అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న అజయ్‌పురం గిరిజనులు

మాడుగుల: తాటిపర్తి పంచాయతీ అజయ్‌పురం సమస్యల పరిష్కారం కోరుతూ గిరిజనులు గురువారం అరిటాకులు చుట్టుకుని, అర్ధనగ్న ప్రదర్శనతో తమ నిరసన తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లవుతున్నా కనీస సౌకర్యాలకు దూరంగా గిరిజన గ్రామాలున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు, తాగునీటి కష్టాలు తీరలేదని, విద్య, వైద్య, ఉద్యోగావకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని వాపోయారు. నాన్ షెడ్యూల్ ఏరియా గిరిజనులకు ప్రత్యేకంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో డోలీ మోతలు తప్పట్లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కార్లి భవాని, గిరిజన సంఘ సభ్యులు వంతాల కేశవరావు, మచిరాజు పోతురాజు, రాజులమ్మ, గిరిజనులు పాల్గొన్నారు.

మద్యం అమ్ముతున్న ముగ్గురి అరెస్టు


స్వాధీనం చేసుకున్న బాటిళ్లతో ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక: ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం అమ్మకాలు చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి 124 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. వివరాలివి. మండలంలోని మూలపేట, రాజుపేట, ఒంపోలు, యాదగిరిపాలెం గ్రామాల్లో మద్యం అమ్ముతున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు గురువారం ఎస్ఐ ప్రసాదరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో మద్యం అమ్ముతున్న ముగ్గురిని ఆరెస్టు చేసి వారి నుంచి 124 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ప్రసాదరావు తెలిపారు.

విశాఖ చేరుకున్న రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శి

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(రెవెన్యూ, రిజిస్ట్రేషన్) రామ్ ప్రకాష్ సిసోడియా గురువారం విశాఖ చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి నేరుగా పోర్టు గెస్ట్ హౌస్‌కు చేరుకుని అక్కడే బస చేశారు. శుక్రవారం విజయనగరం జిల్లాకు వెళ్లి.. సాయంత్రం ఆరు గంటలకు తిరిగి విశాఖ వస్తారు. అనంతరం పోర్టు గెస్ట్‌హౌస్ వద్ద ఫిర్యాదులు స్వీకరిస్తారు. 17న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిల్లాలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని.. అక్కడ ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

మార్కెట్లో శ్రావణ సందడి

- వరలక్ష్మీ వ్రతం కొనుగోళ్లతో దుకాణాలు కిటకిట
- ఆకాశాన్నంటిన ధరలతో జనం బెంబేలు


పూజాసామగ్రి కొనుగోలు చేసే వారితో కిక్కిరిసిన అనకాపల్లి మెయిన్‌రోడ్డు


వస్త్రదుకాణాలు కిటకిట


అనకాపల్లిలో రద్దీగా ఉన్న బంగారు దుకాణం

అనకాపల్లి: మార్కెట్ శ్రావణ శోభతో కళకళలాడుతోంది. రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కావడంతో వస్త్ర, బంగారు దుకాణాలతోపాటు పూజా సామగ్రి విక్రయించే షాపులు కిటకిటలాడాయి. నెహ్రూచౌక్, చిన్ననాలుగురోడ్ల జంక్షన్, బండిగాడి వీధి, రింగ్‌రోడ్ కూడళ్లు జనంతో సందడిగా కనిపించాయి. వరలక్ష్మీ వ్రతానికి పూలు, పండ్లు, చీర, రవిక, లక్ష్మీదేవి ముఖచిత్రం కలిగిన బంగారు కాసును కొనుగోలు చేసి పూజించడం ఆనవాయితీగా వస్తోంది. గత ఏడాది కంటే ఈ ఏడాది అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నప్పటికీ అన్ని వర్గాల వారు ఆచరించే పూజ కావడంతో ఇసుకేస్తే రాలనంతటి రద్దీ నెలకొంది. కొబ్బరికాయ ధర రూ.40–50లు పలికింది. చామంతి పువ్వులు పది రూపాయలకు మూడు ఇవ్వడంతో భక్తులు గగ్గోలు పెట్టారు. డజన్ అరటిపండ్లను సైజును బట్టి రూ.50 నుంచి 130లకు విక్రయించారు. రెండు యాపిల్ పండ్లు రూ.100లు, బత్తాయిలు మూడు రూ.100లు చెప్పడంతో ఏం కొంటాం, ఏం పెట్టి పూజిస్తాం అని భక్తులు వాపోయారు. కాసు బంగారం ధర రూ.6 వేలు ఉండగా, అమ్మవారి ముఖ చిత్రం కలిగిన పూతకాసు ధర రూ.1500 నుంచి 2 వేలు పలుకుతుంది. చిన్న పువ్వుల దండ ధర రూ.100లు ఉండగా, ఒక మాదిరి పెద్ద దండ కావాలంటే కనీసం రూ.250లు వెచ్చించాల్సిన పరిస్థితి.

వస్త్ర దుకాణాల్లో రద్దీ

అమ్మవారికి కొత్త చీర, రవిక పెట్టి పూజ చేయడం ఆనవాయితీ కావడంతో వస్త్ర దుకాణాలు కిటకిటలాడాయి. జిల్లాకు ప్రధాన కేంద్రంగా ఉన్న అనకాపల్లి పట్టణంలో విశాఖకు దీటుగా వస్త్ర దుకాణాలు వెలిశాయి. జిల్లాలో వివిధ ప్రాంతాల ప్రజలు ఇక్కడకు వచ్చి అమ్మవారికి చీరలు, జాకెట్లు కొనుగోలు చేశారు. పట్టణ పరిధిలో రెండు రోజుల్లో సుమారు రూ.రెండు కోట్ల లావాదేవీలు జరిగినట్టు అంచనా.

బంగారు దుకాణాలు...

ప్రధాన మెయిన్‌రోడ్డులో పెద్ద పెద్ద బంగారు దుకాణాలు ఏర్పాటు చేయడంతో చిన్న దుకాణాలు బోసిపోయాయి. పెద్ద దుకాణాలు శ్రావణమాసం ఆఫర్లు పెట్టడంతో కొనుగోలుదారుల వద్ద ఉన్న కొద్దిపాటి పాత బంగారాన్ని ఇచ్చి కొత్త బంగారు వస్తువులను కొనుగోలు చేశారు. రెండు రోజుల వ్యవధిలో పెద్ద దుకాణాల్లో సుమారు రూ 3.5 కోట్ల లావాదేవీలు జరగగా, చిన్న దుకాణాల్లో రూ.కోటి వరకు అమ్మకాలు సాగాయి.

దడ పుట్టిస్తున్న ధరలు

12 సంవత్సరాలుగా వరలక్ష్మీదేవి వ్రతం చేస్తున్నాని, అప్పట్లో రూ.1500 వెచ్చిస్తే పూజ పూర్తయ్యేదని, ప్రస్తుతం వరలక్ష్మీదేవి పూజకు రూ.10 వేల నుంచి 12 వేలు ఖర్చవుతోందని అనకాపల్లికి చెందిన అన్నపూర్ణ అనే కొనుగోలుదారు చెప్పారు. కిరాణా సామగ్రి, కూరగాయలు, బంగారం, వస్త్రాలు.. ఇలా అన్ని రకాల వస్తువుల రేట్లు భారీగా పెరిగాయన్నారు.

కోడ్ ఉల్లం‘ఘనులు’

- స్వాతంత్ర్య దినోత్సవంలో మంత్రి ఒక్కరికే అనుమతినిచ్చిన ఈసీ
- కానీ అనకాపల్లి ఎంపీ, ఎమ్మెల్యే కూడా హాజరు
- మంత్రితోపాటు అవార్డులు అందజేసిన ఎంపీ, ఎమ్మెల్యే
- శకటాలకు నిబంధనాలు'.. ప్రజా ప్రతినిధులకు కోడ్ లేనట్టేనా?



కోడ్ ఉల్లంఘిస్తూ వేదికపై కూర్చున్న ఎంపీ రమేష్, ఎమ్మెల్యే కొణతాల

సాక్షి, అనకాపల్లి: ప్రజా ప్రతినిధులు స్వాతంత్ర దినోత్సవంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోడ్ అమల్లో ఉన్న విషయం విదితమే. గురువారం అనకాపల్లి క్రీడా మైదానంలో కోడ్ ఉల్లంఘిస్తూ.. స్వాతంత్ర్య దినోత్సవంలో బీజేపీ ఎంపీ సీఎం రమేష్, జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు. జెండా పండగలో ప్రభుత్వం నుంచి ఒక ప్రజాప్రతినిధి మాత్రమే పాల్గొనాలని ఈసీ స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినా.. అనకాపల్లి జిల్లాలో మాత్రం అది వర్తించలేదు. మంత్రి అనితతో పాటు ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వేదికపై కూర్చోవడమే కాకుండా.. ప్రతిభా అవార్డులను కూడా ప్రదానం చేశారు. ప్రజాప్రతినిధులకు ఒక్కరికే అనుమతి ఉన్నట్లు ఈసీ స్పష్టంగా పేర్కొన్నా.. వారు కోడ్ ఉల్లంఘించే సరికి కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ దీపిక, జేసీ జాహ్నవి సైతం నివ్వెరపోయారు. కోడ్ ఉల్లంఘన అని తెలిసినా తప్పని పరిస్థితుల్లో వారితో కలిసి ప్రతిభా అవార్డులు అందజేశారు. కోడ్ ఉల్లంఘన పేరిట శకటాల ప్రదర్శనను నిలిపివేసిన కలెక్టర్.. ప్రజాప్రతినిధులు నేరుగా వేదికపైకి వచ్చి కూర్చోవడమే కాకుండా అవార్డులు ప్రదానం చేస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. పొరుగున ఉన్న విశాఖ జిల్లాలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఒక్కరే వేదికను అలంకరించారు. విశాఖ ఎంపీతో సహా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ వేదిక దిగువనే వీక్షకుల గ్యాలరీలో కూర్చున్నారు. అందుకు విరుద్ధంగా అనకాపల్లి జిల్లాలో ప్రజాప్రతినిధులు నేరుగా వేదికను పంచుకోవడం.. అవార్డులు ప్రదానం చేయడం చూస్తే వీరికి కోడ్ వర్తించదా అంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.